# ఇదొక వెర్రితల!

మధ్యాహ్నం మూడు గంటలవుతూంది.

మే నెల. గుంటూరు ఎండ వూరువూర్నీ ఒక పెద్ద గాడిపొయ్యిగా చేసేసి జనాన్ని ఎడాపెడా తిరగా బోర్లా వేయించేసి మాడ్చేస్తోంది!

అసలికే లగ్గసరి సీజను. గుంటూరు బస్సుస్టాండు మంగళగిరి తిరణాలలా వుంది. వచ్చే బస్సు, పోయే బస్సు. దిగే జనం ఎక్కేజనం.

వనజావాళ్ళు ఎక్కిన బస్సు మరో చిన్న గాడిపొయ్యిలాగా వుంది. లోపల కూర్చున్న జనం వుక్కతో వుక్కిరి బిక్కిరయిపోతున్నారు.

మనజ కిటికీ ప్రక్కన కూర్చుందామనుకుంది. కాని రోజా తనని తోసుకుంటే ముందెళ్ళి ఆ జాగా ఆక్రమించింది.

వనజ చెల్లెలు శాంతి ఇద్దరు మధ్యా కూర్చుంది.

వనజ వెంటతెచ్చుకున్న పాత వారపత్రికలో విసురుకుంటుంది.

రోజా పమిటచెంగుతో విసురుకుంటూంది. చేతిలో మేగజైనుగానీ, భుజనా పమిటగానీ లేని శాంతి చేత్తోనే వుఫ్, వుఫ్ అని అనుకుంటూంది. రోజా తల బయటపెట్టి, "ఏయ్ మల్లిపూలూ!" అని పిలిచింది.

గీసిగీసి బేరమాడి రెండు మూరలు కొంది. మొత్తం పూలు తనే పెట్టుకుంది. కనీసం చిన్నపిల్ల శాంతికయినా ఒక తుంపుకూడా ఇవ్వలేదు. రోజా బుద్ధి తనకు తెల్సిందే! తనది ఒక్కపైసా కూడా ఎవ్వరికీ పెట్టదు వుత్త పిసినారిది!

రోజా జడ ముందుకేసుకొని, పులు భుజం మీదకి లాక్కుంటూ జడవంక మురిపెంగా, గర్వంగా చూచుకుంది.

దానిది వుత్తి సవరం జడని తనకు తెలుసు. ఆ సవరంజడకే దానికింత గర్వం!

రోజా వెనక్కితిర్గి, "ఏయ్ రాజా! ఇవ్వాళ ఈ బస్సు కదులుద్దా?" అని అరిచింది.

వెనకసీట్లో కూర్చున్న రాజు అయితే మాట్లాడలేదు గాని, రాజుప్రక్కన కూర్చు గపూరు మాత్రం "ఆఁ కదులుద్ది ఇంకో గంటకు!" అని బడాబడా నవ్వాడు.

రోజా, "ఇంకో గంటకా?" అంటూ అవసరం కంటె అతిగా నవ్వింది.

రోజా కట్టూ జుట్టూ మరీ ఛీప్‌గా వున్నాయి. బస్సులో వాళ్ళందరూ తమవయిపూ చూస్తోన్నారు. వనజకు తలకొట్టేసినట్లుగా వుంది. ఈ రోజా బిగ్గరగా మాట్లాడడం, అయినదానికి కానిదానికి వూరికే వెకిలిగా నవ్వటం చూస్తోంటే తనకు కంపరమెత్తుకొస్తోంది! అసలీ రోజా కూడా వస్తోందంటొ తనీ డ్యాన్సు ప్రోగ్రాంకు చచ్చినా వప్పుకునేదికాదు!

రోజా అంతలోకే మళ్ళీ సోడా బండి వాడ్ని పిలిచింది. సోడా కొట్టించుకొని త్రాగింది. జాకెట్ లోపలికి చెయ్యి పోనిచ్చి చిన్న పర్సు ఒకటి బయటికితీసి డబ్బులిచ్చింది. నీవూ త్రాగుతావా అని కనీసం మాటవరసకైనా ప్రక్కన కూర్చున్న శాంతిని అడగలేదు.

వనజ చెల్లెలు వంక చూసింది.

శాంతి నాలికతో పెదాలు తడుపుకుంటూంది.

చెల్లెలి మీద జాలేసింది. చెల్లెలకు సోడా ఇప్పించింది. తనకూ త్రాగాలనిపించింది. తన దగ్గర ఉన్న ఒకే ఒక్క రూపాయిని చూస్తూ చూస్తూ ఖర్చుపెట్టాలనిపించలేదు. ఈ రూపాయిని కూడ ఇక్కడే ఖర్చుచేసేస్తే ఆ వెళ్ళే ఊళ్లో ఏదయినా అవసరమొస్తే ఎలా? అందుకని సోడా త్రాగాలనే కోరికను చంపుకొని గుటకలు మ్రింగుతూ కూర్చుంది.

నిన్న ఈ రాజు దేముడల్లే వచ్చి రెండురోజుల డ్యాన్సుప్రోగ్రాం వుందని చెప్పి ఇరవయి రూపాయలు అడ్వాన్సు ఇచ్చాడు. అప్పటికి తనూ, తన చెల్లెలూ శాంతీ అన్నం తిని రెండు రోజులయింది. తల్లి సరేసరి. వారం రోజుల్నుంచీ లంఖణాలు.

రాజు ఇచ్చిన ఇరవై రూపాయలతో ఇంట్లోకి అయిదు కిలోల బియ్యం, తల్లికి జ్వరం బిల్లలూ, రొట్టె తెప్పించింది. ఏదయినా అవసరమొస్తుందని తల్లి చేతిలో రెండు రూపాయలు పెట్టి చెల్లెల్ని తీసికొని బయలుదేరింది. సిటీబస్సు చార్జీలు పోను తన దగ్గర ఇక రూపాయి చిల్లర మిగిలింది.

బస్సు బయలుదేరగానే పాసింజెర్లు అమ్మయ్య అనుకొని ఇంతగాలి పీల్చుకున్నారు.

రోజా మెల్లగా శాంతితో కబుర్లు మొదలు పెట్టింది.

వనజ ఊరికే పత్రికలో పేజీలు తిప్పుతూ వీళ్ళ మాటు వింటూ కూర్చుంది.

రోజా శాంతిని ఎన్నో క్లాసు చదువుతున్నావని అడిగింది.

శాంతి నైన్త్ క్లాసు అని చెప్పింది.

"నాకంటే నీవే నయమే" అంది రోజా.

ఆ మాటలకు తన చెల్లెలు కంటే తనే ఎక్కువ గర్వంగా ఫీలయింది. తను చదువు మానేసినా తను రికార్డు డ్యాన్సులు చేసి తన చెల్లెల్ని చదివిస్తోంది. తన చెల్లెల్ని తొమ్మిదో క్లాసే కాదు. పదీ పదకొండూ- ఇంటరూ - బియ్యే - ఎమ్యే ఏది చదువుతే అది, ఎంత చదువుతే అంత [illegible] తన చెల్లెలు చదువుకోసం తను ఎన్ని కష్టా[illegible] [illegible]యిన వుంటుంది.

తనకు చిన్నప్పట్నుంచీ చదువుంటే వల్లమాలిన ఇష్టం. తను చిన్నపిల్లగా [illegible] ఎలకా బలపం పట్టుకొని రోజా వుమెన్స్ కాలేజ్ మీదుగా తను చదువుకునే వీధిబడికి పోతుండేది. బడికి

వెళ్ళేటప్పుడు వచ్చేటప్పుడూ రోజా కాలేజీ అమ్మాయిల్ని చూస్తుండేది. వాళ్ళు రంగు రంగుల చీరల్లో, లంగా వోణీలల్లో కాలేజీకి వస్తొంటే ఒకచిన్న పూలతోటకు కాళ్లువచ్చి నడిచివస్తోన్నట్లనిపించేది. వాళ్ళు తన కంటికి రాజుకుమార్తెల్లాగా, దేవలోకం నుంచి దిగివచ్చిన దేవకన్యల్లాగా కనిపించేవాళ్ళు. వాళ్ల వెళ్ళే కాలేజీ బిల్డింగు తన కళ్లకు ఒక దేవేంద్ర భవనంలాగా కనిపించేంది.

వాళ్ళ చేతుల్లోంచి పుస్తకాల దొంతర్లను చూచి, 'అమ్మో, ఎన్ని పుస్తకాలో!' అనుకునేది. తన చేతిలోని బందులూడిపోయిన బోడి పలక చెక్కవంకా, బలపం ముక్క వంకా చిరాగ్గా చూచుకునేది. ఛీ. తనూ తొందర తొందరగా పెద్దదయి పోవాలి. వీళ్ళలాగే తనూ ఒక దేవకన్యలాగా సింగారించుకొని, బోలెడు పుస్తకాలు పట్టుకొని ఆ దేవేంద్ర భవనంలోకి వయ్యారంగా గర్వంగా నడుచుకుంటూ వెళ్ళాలని కలలు కనేది.

తన చేతిలోని పలకచెక్క పేర్ల పుస్తకంగా, పేర్ల పుస్తకం క్లాసు పుస్తకాలుగా - నోటు పుస్తకాలుగా మారుతున్న కొద్దీ, తన గుండెల్లో తావుచేసుకున్న ఈ కలలు రోజురోజుకూ బాగా వూపిరి పోసుకొని బలంగా బలుస్తూ వచ్చాయి. గుండెల అడుగునవున్న ఆ కలల బలుపై పై గుండెల మీదకు తన్నుతుందా అన్నట్లు రోజురోజుకు అవి ఏపుగా పెరుగుతూ చివరికి వాటికి పమిట మరుగు కావల్సి వచ్చింది.

ఒకరోజున తన తల్లి "ఇక నిన్ను నేను చదివించలేను. చదివింది చాలు. ఇక చదువు ఆపేయవే తల్లీ!" అంది మంచంమీద నుంచి దగ్గుతూ.

తల్లి ఆ మాట అంటున్నప్పుడు తను స్కూలు కెళ్ళటానికి అన్నం తింటున్నది. అప్పట్లో తను ఎనిమిదో క్లాసు చదువుతూంది. తింటున్న ఆ అన్నం, పచ్చడీ ఎదురింటి సావిత్రి అక్కాయి తీసికొచ్చి యిచ్చింది. నిన్నట్నుంచి పిల్లలకు తిండిలేదని అమ్మ ఏడుస్తూ చెప్పితే ఆ సావిత్రి అక్కాయి జాలి తలచి తెచ్చి యిచ్చింది.

చెల్లెలు అప్పటికే రెండు ముద్దలు తిని తన బోడిచెక్క తీసుకొని బడికెళ్ళిపోయింది.

తల్లి అన్నమాటకు తనకేడుపు ముంచుకొచ్చింది. అన్నం తినడం మానేసి ఏడుస్తూ కూర్చుంది. ఆ ఏడవటం ఏడవటం రెండు రోజుల పాటు ఏడ్చింది ఏడ్చినట్లే వుంది.

మూడోరోజున అమ్మ తనని సావిత్రి అక్కాయి వెంట డ్యాన్సు ప్రోగ్రాంకు పంపించింది.

వెళ్ళనని ముందు మొరాయించింది. కాని, ఆకలితో శోషవచ్చిన చెల్లినీ, దగ్గుతో మెలికలు తిరుగుతున్న తల్లినీ చూసి, తప్పక విధిలేక వెళ్ళింది.

చిన్నప్పట్నుంచి మనస్సుకు పట్టిన సిన్మా డ్యాన్సులు అక్కరకొచ్చాయి. జనాన్ని ఆకట్టుకొని వాళ్ళచేత ఈలలు కేకలు వేయించగలిగే చౌకబారు చిట్కాలు సావిత్రి అక్కాయి చెప్పింది. 'వూపులూ' , 'జర్కులూ' నేర్పింది.

చివరికి ఈ రికార్డు డ్యాన్సులు తనకు బ్రతుకు తెరువయ్యాయి.

ఒకరోజు తను కాకానిప్రభల బళ్ళమీద డ్యాన్సులు చేస్తోంది. ఆ ప్రభల బళ్ళు ఉమెన్స్ కాలేజీ

రోడ్డులో ఆగాయి. అప్పుడే కాలేజీ వదిలారు. కాలేజీ అమ్మాయిలంతా బిలబిలా బయటికి వస్తొన్నారు.

తను 'ఆరేసుకోబోయి పారేసుకున్నాను.....' అనే రికార్డుకు అనుగుణంగా డ్యాన్సు చేస్తోంది.

కాలేజీ అమ్మాయిలు తన డ్యాన్సు చూసి తెగ నవ్వుకున్నారు.

తనకప్పుడు ఆపుకోలేనంత ఏడుపు వచ్చింది. తను చిన్నప్పటునంచి కన్న కలలేంటి? ఇప్పుడు తను చేస్తోందేమిటి? ఏ కాలేజీ అమ్మాయిలతో తనూ ఒకతయి వాళ్ళతో కలిసి చదువుకోవాలని కలలు కన్నదో ఆ కాలేజీ అమ్మాయిలముందే తను రికార్డు డ్యాన్సు చేస్తోంది.

ఓరి దేముడా, నన్నిలాగే రాతిబొమ్మయిపోవాలని శపించేయి తండ్రీ! లేకపోతే ఈ ఎద్దులబండి కూలిపొయ్యేటట్లు చెయ్యి. లేకపోతే నేను నిలువునా కాలిపొయ్యేటట్లు చెయ్యి అని లోపల్లోపల కుళ్ళి కుళ్ళి ఏడ్చింది.

ఆ రాత్రి అన్నం తినకుండా ఏడుస్తూ పడుకుంది.

కొందర్ని దేముడు చక్కగా చదువుకోమంటాడు. మరికొందర్ని బజారు డ్యాన్సులు చెయ్యమంటాడు కాబోలు అని ఆతర్వాత సరిపెట్టుకుంది, మనస్సును రాయి చేసుకుంది. తన ఏడ్పును తానే దిగమ్రింగుకుంది. తన బాధను తన గుండెల్లోను దాచుకుంది.

ఇప్పటికికూడా పుస్తకాలు పట్టుకొని కాలేజీకెళ్ళే ఏ కాలేజీ అమ్మాయిని చూసినా తన మనసు మూగగా రోదిస్తుంది. తన గుండెల్లోని బాధ సన్నగా కలుక్కుమంటుంది.

అందుకే తనబదులు తన చెల్లెల్ని చదివించాలని నిశ్చయించుకుంది. అదే తన జీవితధ్యేయంగా పెట్టుకుంది.

బస్సు ఏదో స్టేజీలో ఆగి మళ్ళీ బయలుదేరింది.

రోజా శాంతిని "నీవెందుకొస్తున్నావు? నీవూ డ్యాన్సు చేస్తావా?" అని అడింది.

"చెయ్యను. ఊరికే మా అక్కయ్యకు తోడుగా వస్తున్నా!" అంది శాంతి.

శాంతిని తనే రమ్మంది. ఇప్పుడు తాము వెళుతుంది పెళ్ళిళ్ళ ప్రోగ్రాంకు. పెళ్ళిళ్ళల్లో రెండు పూటలా కాఫీ టిఫిన్లూ, భోజనాలూ పెడతారు. పెళ్ళి భోజనాలంటే రకరకాలకూరలూ పిండివంటకాలూ వుంటాయి. అందులో పల్లెటూళ్ళల్లో తమలాంటి డ్యాన్సు పార్టీలను స్పెషలుగా చూస్తారు.

ఈ రెండు మూడు రోజులయినా కడుపునిండా సుష్టుగా భోంచెయ్యవచ్చు. తిండి గురించి నిశ్చింతగా వుండవచ్చు. అదే గుంటూరులో ఇంటివద్దే వుండిపోతే పచ్చడి మెతుకులే గతి! ఆ బియ్యం కాస్తా అయిపోతాయి. అందుకే తనవెంట శాంతిని రమ్మంది. పైగా దానికిప్పుడు క్రిస్మస్ శలవులు కూడ.

రోజా శాంతిని, "ఏస్కూళ్ళో చదువుతున్నావు" అని అడిగింది.

"మాజేటి గురవయ్య స్కూలు" అంది శాంతి.

"మరెక్కడన్నా మొదలు పెట్టవా?" శాంతి వంక కొంటెగా చూస్తూ రోజా అంది.

పాపం, ఆ పిల్లకు ఈ రోజా ఏఁవంటుందో అర్థం కాలేదు.

"ప్రవేటా?" అమాయకంగా అంది.

"ప్రవేటు కాదు పిల్లా! లవ్వూ - మీ స్కూల్లో మొగపిల్లలు లేరా? నీకోడూ లేడా?" అని కిసకి.సా నవ్వింది.

పాపం శాంతి బిత్తరపోయి వాళ్ళకేసి చూసింది.

వనజ కోపంగా "ఏంటి రోజా, చిన్నపిల్లను పట్టుకొని లేనిపోని మాటలు అంటావు!" అంది.

శాంతి జాకిట్ షేపులు వంక చూస్తూ, "చిన్న పిల్లా? నాకీ వయస్సులో అన్నీ అయిపోయాయి!' అంది రోజా వెకిలిగా నవ్వుతూ.

"ఆ సంగతి తెలుస్తూనే వుంది. నీవు ఇటువచ్చి కూర్చో శాంతి!" అని తను అటు కూర్చుంది.

మరి కాసేపటికి బస్సు అడ్డరోడ్డు దగ్గర ఆగింది. అక్కడ్నుంచి వీళ్ళు వెళ్ళవల్సిన వూరు మూడుమైళ్ళ దూరం. ఒక గూడురిక్షా మాట్లాడుకుని వూళ్ళోకి బయలుదేరారు.

రిక్షా వూళ్ళోంచి పోతుంటే జనమంతా తమవైపే చూస్తున్నారు.

ఇద్దరు పిల్లలు పరుగెత్తుకుంటూ తమ రిక్షా వెంటబడ్డారు. వాళ్ళను చూసి వనజ చిన్నగా నవ్వుకుంది.

రిక్షా పెళ్ళివారింటిముందు ఆగింది.

ఈ పల్లెటూళ్లూ, పల్లెటూళ్ళల్లో పెళ్ళిళ్ళూ, పెళ్ళి పందిళ్ళలో జనం, వాళ్ళు తమవంక చూచే వింత చూపులూ, వాళ్ళ ముసిముసి నవ్వులూ, రకరకాల వ్యాఖ్యానాలూ - అన్నీ తనకలవాటే!

ఒక బుర్రమీసాల పెద్దమనిషి "అరేయ్ సత్యం! వీళ్ళను బుల్లియ్య బాబాయి గాదింటికి తీసుకెళ్ళరా!" అని ఒక పువ్వుల షర్టుకు పురమాయించాడు.

ఆ సత్యం చీఫ్ మినిష్టర్‌షిప్ దొరికినంతగా సంబరపడిపోతూ, "రండి.... రండి!" అంటూ వీళ్ళను తోడ్కొని పోయాడు.

ప్రక్కసందుకు మళ్ళగానే ముందు నడుస్తున్న సత్యం గబుక్కున ఆగిపోయాడు. అతని వెనకాలే నడుస్తున్న వీళ్ళూ ఆగిపోయారు. సత్యం ఆ జేబూ ఈ జేబూ తడుముకొని ప్రక్కజేబులోంచి నల్ల కళ్ళజోడు బయటకుతీసి పెట్టుకున్నాడు. ఒక చిన్న పోజు యిచ్చి మళ్ళీ బయలుదేరాడు.

వనజ ప్రక్కన నడుస్తూ, "యువరాజు సిన్మా చూశావా? యువరాజులోని క్రొత్తరకం డ్యాన్సులు చేస్తావా?" అన్నాడు.

వనజకు ఇలాంటి 'పల్లెటూరి సత్యం'ల సంగతి బాగా తెలుసు. కొద్దిగా సందు యిస్తే మొగానికి వేసుకున్న రంగులాగా ఒక పట్టాన వదలరు.

అందుకే నోటితో జవాబు చెప్పకుండా, చేత్తో రోజా వంక చూపించింది.

సత్యం ఇక రోజా వెంట పడ్డాడు.

రోజాకి కూడా ఇలాంటి 'సత్యం'ల సంగతి తెలుసు. "నీవు ఆ నల్లకళ్ళజోడు పెట్టుకుంటే అచ్చం అక్కినేనిలాగా ఉన్నావు!" అంది.

"నీవూ ఈ మాటే అన్నావూ?" అంటూ వూరికే మెలికలు తిరిగిపోయాడు.

అలా వూరికే మెలికలు తిరిగిపోయిన ఆ సత్యం, మెలికలు మెలికలుగా వున్న సందుల్లోంచి తీసుకుపోయి తీసుకుపోయి చివరికి ఒక యింటి ముందు ఆపాడు.

"ఇదే మా బుల్లియ్యబాబాయి గారి యిల్లు!" అన్నాడు.

ఆ యింటికెదురుగా రాములవారి గుడి కూడా వుంది.

ముందుగదిలో ఈతాకు చాపలు పరిచివున్నాయి.

వనజ వాళ్ళంతా నీరసంగా ఈ చాపలు మీద వాలిపోయారు.

వనజ, "నాగేశ్వర్రావు గారు! మాకు కాస్త టీలు పంపించండి!" అంది నాటకీయంగా.

ఆ సంబోధనకు సత్యం వెనక్కి ముందుకూ, ఇటుకు అటుకూ చూచి, మళ్ళీ అర్థం అయినట్లు నవ్వి, "ఒక్క మినిట్‌లో పంపిస్తా?" అన్నాడు.

రోజా "కాస్త ఫలహారాలు కూడ!" అంది.

సీరియస్‌గా "ఫలహారాలుకూడ కావాలంటే ఒక్క మినిట్‌లో కాదు! రెండు మినిటల్లో పంపిస్తా!" అని గబగబా వెళ్ళిపోయాడు.

రెండు మినిట్లు కాదుకదా, రెండొందల మినిట్లు అయినా ఫలహారాలు టీలూ రాలేదు. చీకట్లు మాత్రం వచ్చాయి. వాటి వెనుకే చుక్కలు కూడ వచ్చాయి.

రాములవారి గుడిలో దీపం వెలిగింది. పెళ్ళింట్లో గ్యాసులైట్లు వెలిగాయి.

గుడిలో గంటలు మ్రోగాయి. పెళ్ళింట్లో బాజా భజంత్రీలు మ్రోగాయి.

వూరేగింపు బయలుదేరబోతుంది. డ్యాన్సర్లు రావాలి అని కబురు తీసుకొని సత్యం మళ్ళీ వచ్చాడు.

"టీ ఫలహారాలు ఏవయ్యా పెద్దమనిషీ?" అని రోజా అతడ్ని నిలేసింది.

"నన్ను మల్లెపూల కోసం పంపించారు. మీకు టీలు రాలేదా?" అని నొచ్చుకున్నాడు.

దగ్గర్లో వున్న పాక హోటల్నుంచి టీలు మాత్రం తెప్పించాడు.

"ప్రస్తుతానికి ఇవి త్రాగండి! మీరక్కడికి రాగానే లడ్లూ సున్నివుండలూ తీసికొచ్చి యిస్తాను" అని మళ్ళీ ఆశపెట్టాడు.

ఆ పొగచూరు నీళ్ళు త్రాగి మొగాలకు రంగులు పట్టించటానికి వుపక్రమించారు.

చందమామ కాస్త ఆలశ్యంగా వచ్చినా వెన్నెలలను ఘనంగా వెంటబెట్టుకు వచ్చారు.

ఆ వెన్నెలకాంతిలో రంగులు పూసుకున్న వనజా రోజాల మొగాలు ఎర్రెర్రగా అరివిచ్చుకున్న గులాబీలులాగా వున్నాయి. వాళ్ళ బుగ్గలకు రాసుకున్న చెమ్కీ తళుక్కు తళుక్కుమంది. వాళ్ళ జడల్లోని మల్లెలు వెన్నెట్లో మరింత తెల్లగా కనిపించాయి.

వాళ్ళు నాసిరకం దేవకన్యలులాగా వున్నారు. వాళ్ళ ప్రక్కన శాంతి సాదాసీదాగా, అరవిరిసిన పూల ప్రక్కన పసిమొగ్గలాగా, అరమ్రగ్గిన మామిడిపళ్ళ ప్రక్కన పసిపిందలాగా వుంది.

మొగాలకు రంగులు పూసుకున్న మొగ డ్యాన్సర్లు దేవకన్యల రాజ్యంలో మొగరక్షక భటుల్లాగా వున్నారు.

గ్యాసులైటు పట్టుకొని సత్యం ముందు దారితీశాడు. అతని వెనుక వీళ్ళు - వీళ్ళ వెనుక వీళ్ల రంగువేషాలు చూస్తూ వూళ్ళో కుర్రమూక వెంటబడ్డారు.

వీళ్ళు పెళ్ళింటికి చేరుకునే సరికి వూరేగింపు బయలుదేరటానికి సిద్ధంగా వుంది.

మల్లెపూలదండలతో అలంకరింపబడ్డ టాపులేని చిన్నకారు యింటి ముందు ఆగివుంది. అందులో క్రొత్త పెళ్ళికొడుకు, పెళ్ళికూతురూ కుదురుగా కూర్చుని వున్నారు.

చిన్నకారు చుట్టూ కుర్రకారు చేరారు. ఈ కుర్రకారల వేషభాషలు వాళ్ళు 'సిటీకారులు' అని చెప్పకయే చెప్తున్నాయి!

పెళ్ళికొడుకు హైదరాబాదులో సెక్రటేరియట్‌లో వుద్యోగం. అతని సహచరులూ, సావాసగాళ్ళూ హైదరాబాదునుంచి ఈ పెళ్ళికి ఈ పల్లెటూరికి విచ్చేశారు.

పెళ్ళి పెద్దలూ, మిగతా జనం అక్కడక్కడ నిలబడి మాట్లాడుకుంటున్నారు.

అక్కడ అందరు ఈ గుంటూరు డ్యాన్సర్ల కోసం ఎదురుచూస్తోన్నారు.

సినిమా మేకప్‌లో విచిత్రం కేశాలంకరణలో, తలలో తట్టెడు మల్లెపూలతో, అచ్ఛాదనలేని కుచ సంపదతో అందరి చూపులను ఆకట్టుకుంటూ అప్పుడు వనజారోజాలు అక్కడికి వచ్చారు.

వాళ్ళను చూడగానే మాటలన్నీ ఆగిపోయాయి. తలలన్నీ ఇటువయిపు తిరిగాయి. కళ్ళన్నీ వాళ్ళ వంకే చూచాయి. చూపులన్నీ వాళ్ళ అంగాంగాలను తడిమాయి. బ్యాండుమేళం మ్రోగసాగింది. సిన్మారికార్డుల జోరు ఎక్కువయింది.

అందరి చూపులు తమ మీద వుంటే వనజ చూపులు సత్యం కోసం వెతకసాగాయి. అతను వచ్చి యిస్తానన్న లడ్లూ, సున్నివుండల్లూ తలచుకుంటుంటే కడుపులో ఆకలి పెట్రేగి పోతూంది. అతను తెచ్చి యిచ్చే ఫలహారాలూ ఏ మూలో నిలబడి గబగబా తినేసి, ఇన్ని నీల్ళు త్రాగితేగాని డ్యాన్సు చేయటానికి వంట్లోకి వోపిక రాదు.

శాంతి మెల్లగా, "అక్కా, సున్నుండలు" అంది.

"నేనూ అదే చూస్తున్నా శాంతి! ఈ షోకుల సత్యం కనిపిస్తం లేదు!" అంది.

మళ్లీ, "బాగా ఆకలిగా వుందా శాంతీ?" అంది.

శాంతి తల వూగించింది.

తనపనీ అలాగే వుంది! మరి ఈ సత్యం ఎక్కడికిపోయాడో ఏంటో! రాజుతో చెప్పుదామనుకునే లోపల అక్కడొక గుంపు తయారయింది డ్యాన్సు - డ్యాన్సూ అంటూ తొందరపెట్టసాగారు.

గూడుబండిలోని మైకు, 'బంగినిపల్లి మామిడిపండు కోతకొచ్చింది...' అంటూ పాట మొదలుపెట్టింది. ఆ పాటకు తగ్గట్టు రాజూరోజాలు అభినయించి ఆడటం మొదలుపెట్టారు...

కుర్రకారులో వుషారు త్రోసుకువచ్చింది. నడికారూ, ముసలికారులో కూడా వుత్సాహం ముంచుకొచ్చింది.

వనజకు మాత్రం కడుపులో ఎలకలు రాక్ అండ్ రోల్ మొదలుపెట్టాయి.

రోజా 'వూపు'లకు పల్లెటూరు కుర్రోళ్ళు ఈలలు వేయసాగారు.

సిటీ కుర్రోళ్ళు నోళ్ళు చప్పరించారు. పెదాలు విరిచారు. వాళ్ళల్లో ఒక 'సిన్మా పర్సనాల్టీ' చిన్నకారులో పెళ్ళికొడుకు హోదాలో కూర్చున్న తమ ఫ్రెండు దగ్గరకివెళ్ళి ఏదో గుసగుసలాడాడు.

ఇంతలో పాట అయిపోయింది. ఆటా ఆగిపోయింది.

'సిన్మా పర్సనాల్టీ' జనాన్ని త్రోసుకుని ముందుకొచ్చాడు. తన గ్రూపు కుర్రాళ్ళందర్నీ ముందుకు చేర్చాడు. బ్యాండు మేళంవాళ్ళను పిలిచి ఏదో చెప్పుతున్నాడు.

ఇంతలో సత్యం అక్కడ ప్రత్యక్షమయ్యాడు. అతడ్ని చూడగానే వనజకు ప్రాణం లేచివచ్చింది. అతడ్ని చెయ్యిపట్టుకొని ప్రక్కకిలాగా సిగ్గువిడిచి తన ఆకలిబాధ గురించి చెప్పింది.

"సారీ, నన్ను కూల్‌డ్రింకులుకోసం పంపారు. ఇదిగో ఒక్క మినిట్లో తెస్తా-" అన్నాడు.

అతను లోపలికి వెళ్ళబోయే లోపల బ్యాండుమీద ఏదో హిందీపాట మొదలయింది. 'సిన్మాపర్సనాల్టీ' డాన్సుమాష్టరు పోజులో 'రెడీ వన్-టూ-త్రీ!' అన్నాడు.

అతని ఫ్రెడ్సంతా అతనితోపాటు డ్యాన్సు చెయ్యటం మొదలుపెట్టారు.

ఆ డ్యాన్సు చూస్తూ సత్యం అక్కడ నిలబడిపోయాడు.

బ్యాండుమేళం జోరుగా మ్రోగుతూంది...

సిటీ కుర్రోళ్ళ డ్యాన్సు వుషారుగా సాగుతూంది....

ఈలలూ కేకలూ మొదలయ్యాయి.

ముసలీముతకా, చిన్నాచితకా అంతా వాళ్ళ చుట్టూచేరి, వాళ్ల చేస్తోన్న డ్యాన్సును వింతగా చూడసాగారు.

ఇళ్లల్లొంచి ఆడవాళ్ళు కూడ బయటికి వచ్చి విడ్డూరంగా ఈ డ్యాన్సు చూస్తోన్నారు.

సూటూ బూటూ వేసుకున్న ఈ పట్నం కుర్రోళ్ళు రోడ్డుమీద అలా డ్యాన్సు చెయ్యటం అక్కడందరికి వింతగా, క్రొత్తగా సరదాగా వుంది.

ఈ పల్లెటూరులో తమ క్రొత్తరకం డ్యాన్సుతో ఒక 'థ్రిల్' సృష్టించిన తన ఫ్రెండ్స్‌వంక పెళ్ళికొడుకు మెచ్చుగోలుగా చూశాడు. పెళ్ళికూతురు కూడ వంచుకున్న తల ఎత్తి ఆ డ్యాన్సు చూడసాగింది.

ఎప్పుడు కలిసిపోయాడో సత్యంకూడ వాళ్ళతో కలసిపోయి వుషారుగా డ్యాన్సు చేయసాగాడు.

అక్కడ చేరినజనం ఎవ్వరూ ఇప్పుడు వనజా రోజాలవంక చూడటం లేదు. అందరి దృష్టి ఈ పట్నంకుర్రోళ్ళ డ్యాన్సుమీదే వుంది. ఎవ్వరూ వీళ్ళను గురించి పట్టించుకోవటం లేదు. వీళ్ళూ ఆగుంపులో ఒకరయిపోయారు.

వనజ పట్నం కుర్రోళ్ళతో కలసి గంతులేస్తున్న ఆ సత్యంవంక నిస్సహాయంగా చూస్తూ నిలబడిపోయింది. ఆకలితో, నీరసంతో ఆమెకు కళ్ళు తిరుగుతున్నట్లనిపించింది.

మెల్లగా వూరేగింపు వూళ్లోకి సాగింది.

వనజావాళ్ళు కూడా వూరేగింపులో కలసి నడవసాగారు.

మెయిన్‌రోడ్డు సెంటర్లో పట్నం కుర్రోళ్ళు మహీవుషారుగా డ్యాన్సు చేశారు. వూరు వూరంతా విరగబడి ఈ కొత్తరకం డ్యాన్సు చూడసాగింది.

ఆ వూరు కుర్రకారుకయితే మరీ వేలంవెర్రిగా వుంది. కొంతమంది ఈవూరు కుర్రోళ్లు సిటీ కుర్రోళ్ళతో కలిసిపోయి వళ్ళుమరచి డ్యాన్సు చేయసాగారు.

రికార్డు డ్యాన్సులు ఈ వూరికి పాతే! ఈ డ్యాన్సులే క్రొత్త!

వనజావాళ్ళు ఆ గుంపులో ముందు వరుసలో బిక్కమొగాలేసుకొని నిలబడి వున్నారు.

జనంలో ఎవరైనా తమ డ్యాన్సు కావాలంటారేమోనని ఆశగా ఎదురుచూడసాగారు.

ఒక జట్టు తర్వాత మరోజట్టు వాళ్ళే చేస్తున్నారు. కానీ ఎవ్వరూ వీళ్ళను డాన్సు చేయమనటంలేదు.

ఒకడు టవల్ను వోణీలాగా వేసుకొని స్త్రీలాగా అభినయిస్తుంటే మరొకడు ఆ స్త్రీని ప్రేమతో అనునయిస్తూ డ్యాన్సు చేస్తున్నాడు. ఈజంటను చూచి జనం విరగబడి నవ్వుతూ ఈలలూ కేకలూ వేస్తోన్నారు.

ఎవరో జనంలోంచి, "ఈ దొమ్మరి లంజల డ్యాన్సుకంటే ఈ డ్యాన్సే బాగుందహే!" అనీ కామెంటు చేశారు.

ఆ చీప్‌కామెంట్ వనజా రోజాలిద్దరూ విన్నారు.

వనజ కళ్ళల్లోకి చివ్వున నీళ్లుగ్గారాయి. ఏడ్పు ముంచుకొచ్చింది. బాధతో తలవంచుకుంది.

రోజా తల ఎగరేసి ఆ కామెంటు వచ్చినవైపు రోషంగా చూచింది.

రోజా రోషం ఆ గుంపులోని పోకిరికుర్రాళ్లకు ఒక సవాలుగా ఒక కవ్వింపుగా అనిపించింది.

ఆ పోకిరి కుర్రాళ్ళు మెల్లమెల్లగా ముందు త్రోసుకువచ్చి ఒక చిన్నసైజు త్రొక్కిసలాట కల్పించారు. ఆ తోపులాటలో ఎవరో తుంటరి వెధవలు రోజామీదా, వనజమీదా పడ్డారు.

రాజా గఫూర్లు ఎలాగో అడ్డుకొని వీళ్ళను ఆ గుంపులోంచి బయటికి తీసికొచ్చారు.

వనజావాళ్ళంతా బయటికివచ్చి ఒక హోటలు ప్రక్కన నిలబడ్డారు.

రోజా కోపంగా, 'మాయదారి సచ్చినోళ్ళు - వెధవసచ్చినోళ్ళు - సిల్లరసచ్చినోళ్ళు' అని తిట్టుతూంది.

వనజ నిష్ఠూరంగా వాళ్ళ డ్యాన్సుపార్టీ లీడరూ, వోనరూ అయిన రాజుతో, "రాజా! వీళ్ళకసలు మన డ్యాన్సు కావాలో అఖ్ఖర్లేదో కనుక్కో!" అంది.

రాజూ, గఫూరు మళ్ళీ ఆ గుంపులోకి వెళ్లారు.

ఆ హోటలుకు ఆనుకొని ఒక బడ్డీకొట్టు వుంది. రోజా ఆ బడ్డీకొట్టు అరుగుమీద కాళ్ళూ వూగిస్తూ కూర్చుంది.

బడ్డీకొట్టులోని సోడాసీసాలూ కూలుడ్రింకు సీసాల్ను చూడగానే వనజకు అంతవరకు మరిచిపోయిన దాహం గుర్తుకు వచ్చింది. నాలిక పిడచ కట్టుకుపోసాగింది.

ఆమె ప్రక్కకుతిర్గి చెల్లెలు వంక చూచింది. శాంతికూడ సోడాలవంక ఆశగా చూస్తోంది.

వనజకు దాహంతోపాటు కడుపులో ఆకలి కూడ దంచేస్తోంది. నీరసం ముంచుకొస్తోంది. కాళ్ళు పీకుతున్నాయి.

పోయినసారి ఈవూర్కొచ్చినప్పుడు ఇదే సెంటర్లో డ్యాన్సు చేస్తోంటే అభిమానులు వద్దన్న కొద్దీ సోడాలు, కూలుడ్రింకులూ, టీలూ తీసుకొనేదాకా ప్రాణం తీశారు.

మరి ఇప్పుడో? తమ మొగంచూసేవాళ్ళే లేరు. పైగా 'భోమ్మరిలంజలు' అంటూ అసభ్యంగా కామెంట్ చేసి, మృగాల్లా ప్రవర్తించారు.

మరి ఈవూరికేం వుప్పదల వచ్చిందో?

ఇంతలో గుంపులోంచి ఒక్కసారిగా కేకలూ ఈలలూ అరుపులూ వినిపించాయి.

వనజ దీర్ఘంగా నిట్టూర్చింది.

చెల్లెలుతో, "మంచినీళ్ళు త్రాగుదాంరా శాంతీ" అంటూ హోటల్లోకి దారితీసింది.

హోటలు టేబిలుమీద రెడీగా వున్న మంచినీళ్ళ గ్లాసుల్ను చూడగానే ప్రాణం లేచివచ్చింది. నీళ్ళ త్రాగాక ప్రాణం కుదుటపడింది.

గ్లాసు తర్వాత గ్లాసు గటగటా త్రాగుతున్న చెల్లెల్ను చూస్తోంటే వనజకు జాలి ముంచుకొచ్చింది.

పసిదాన్ని అనవసరంగా తనవెంట తీసుకొచ్చి బాధపెట్టుతున్నా కదా అనుకుంది. ఇలా జరుగుతుందని ఎవరికి మాత్రం తెలుసు అని మళ్ళీ అనుకుంది.

చెల్లెలు ఆకలిమొగం చూస్తోంటే తనకు కడుపు తరుక్కుపోతుంది. అందుకే రెండు సింగిల్ టీలు ఆర్డరిచ్చింది.

"కూర్చోవే!" అంటూ అక్కడున్న బెంచీ మీద కూలబడింది.

రోడ్డు సెంటర్లో కుర్రోళ్ళ డ్యాన్సు జోరుగా సాగుతూంది. బ్యాండుమేళం వుషారుగా మ్రోగుతూంది.

వేడివేడి టీ మెల్లగా త్రాగుతూ బయటికి చూస్తూ కూర్చుంది వనజ.

బయట రోజా మెల్లగా కిళ్ళీకొట్టువాడ్ని 'వరుస'లోకి దింపింది. ఇక వాడ్ని 'సరి' చెయ్యటం మొదలు పెట్టింది. సీసాల్లోని బిస్కెట్లు తీసికొని తింటూ, కూలుడ్రింకులు త్రాగుతూంది.

అదిచూచి వనజా శాంతీలు ఒకరిమొగం ఒకరు చూచుకొని నవ్వుకున్నారు.

టీలు త్రాగి డబ్బులివ్వటానికి కౌంటరు దగ్గరికి వచ్చింది.

కౌంటర్లో వుండాల్సిన శాస్త్రీ బయట అరుగు చివర్న నిలబడి, సెంటర్లో జరుగుతున్న డ్యాన్సేను ఎగిరెగిరి చూస్తోన్నాడు.

"ఆ కొజ్జాల డ్యాన్సు చూస్తోన్న కొజ్జా!" అని మనస్సులో తిట్టుకొని వనజ కోపంగా చిల్లర డబ్బులు టేబిలు మీద పడేసి విసురుగా బయటికి వచ్చింది.

అంతలోకే రాజు అక్కడికి కాళ్ళీడ్చుకుంటూ వచ్చాడు.

"ఎవ్వరూ సరిగ్గా సమాధానం చెప్పటంలేదు. అందరూ ఆద్యాన్ను వెర్రిలో వున్నారు. ఇక మన ప్రోగ్రాం లేనట్లే. మీరెళ్ళి ఆయింట్లో రెస్టుతీసుకోండి. మేం త్వరగా వస్తాం-" అన్నాడు.

"మరి మా భోజనాలు సంగతి?" వనజ అడిగింది.

"పెళ్ళోళ్ళు పెట్టితే తినాల్సిందే! నాకాడ డబ్బుల్లేవు" అన్నాడు.

కాళ్ళీడ్చుకుంటూ ఆ చీకట్లో ఆ సందులూ గొందుల్లో నడుచుకుంటూ తమకిచ్చిన యింటికి చేరేసరికి వనజకు మళ్ళీ నీరసం ముంచుకొచ్చింది. త్రాగిన ఆ కాసిని టీనీళ్లు ఎటుపోయాయో ఆకలితో ప్రాణం శోషకొచ్చింది.

వసారాలో వేసిన చాపమీద వొరిగిపోయింది.

శాంతికూడా మూడంకెవేసి వాళ్ళక్కను అంటిపెట్టుకొని పడుకుంది.

రోజామాత్రం జాకిట్‌లోపల్నుంచి జర్దాకిళ్ళీ బయటికి తీసి నములుతూ కూర్చుంది.

* * *

నిద్రపోతున్న శాంతి చెయ్యి బరువుగా తన మొగం మీద పడగానే వనజకు మెలకువ వచ్చింది.

కన్నతల్లి జోలపాటలాగా చల్లగాలి మెల్లగా చల్లగా వీస్తోంది. ఎక్కడో ఒక కుక్క వూరికే మొరుగుతూంది.

ప్రక్క గదిలోంచి గుసగుసలు వినిపిస్తూన్నాయి. రోజా ఉండివుండీ కిసకిసా నవ్వుతూంది.

వనజ, 'ఛీ! ఇలాంటిదానితో ఇంకోసారి చచ్చినారాకూడదు' అని మనస్సులో ఏవగించుకుంది.

తనను చుట్టేసుకున్న శాంతి చేతుల్ని మెల్లగా తప్పించుకొని లేచి కూర్చుంది.

పాపం, చందమామక్కూడ ఆ పూట 'దుప్పి భోజనమే' లాగుంది. ఆకలి నీరసంతో ఏ మబ్బు మాటున వరగిపోయాడో ఏమో! వెన్నెల గ్రుడ్డి గ్రుడ్డిగా వుంది.

అప్పుడు టైం పన్నెండు అయిందో, ఒంటి గంటే అయిందో! ఊరంతా మాటుమణిగింది.

ఎదురుగుండావున్న రాములవారి గుడిలో గ్రుడ్డి ఆముదం దీపం యోగసమాదిలో వున్న భక్తుడిలాగా నిశ్చలంగా వెలుగుతూంది.

ఎవరూ తమను భోజనాలకు పిలిచిన వాళ్ళులేరు. అసలు వీళ్ల వున్నారా, తిన్నారా అని తమ గురించి పట్టించుకునేవాళ్ళే లేరు.

రోజా మాత్రం తన తంటాలేదో తను పడుతున్నట్లుంది. తనూ తన చెల్లెలు శాంతీ యిద్దరూ ఆకలి నీరసంతో నిద్రపోయారు.

వనజ మెట్లు దిగి రాములవారి గుడివయిపు నడిచింది.

తాళంవేసిన కటకటాల తలుపులవతల ఆముదం దీపం కాంతిలో రాములవారు సీతాలక్ష్మణ సమేతులయి చిద్విలాస ముద్రలో మాగన్నుగా విశ్రాంతి తీసుకుంటున్నారు.

వనజ తలుపు ఇవతల కూర్చుంది. కడ్డీ సందుల్లోంచి కనిపిస్తోన్న రాములవారి కమనీయమూర్తి వంక నిశ్చలంగా భక్తిభావంతో చూస్తోంది...

స్వామి, నీవు కటకటాల వెనుక వున్నావా? లేక మమ్మల్నందర్నీ కటకటాల వెనుక బంధించి నీవు మాత్రం బయట వున్నావా అని చిన్నగా నవ్వుకుంది...

యుగాలు మారుతున్నాయి. సంస్కృతులు మారుతున్నాయి. నాగరికతలు మారుతున్నాయి. ప్రజల జీవనగతులు మారుతున్నాయి. రాజ్యాలు మారుతున్నాయి, ప్రభుత్వాలు కూలుతున్నాయి. జనాలు చస్తూవున్నారు. మళ్ళీ మళ్ళీ పుడుతున్నారు.

కాని నీవుమాత్రం - మార్లేదు తండ్రీ! ఏవూర్లో వాడివి ఆ వూర్లోనే వున్నావు. ఏ గుళ్లోవాడివి ఆ గుళ్లోనే వున్నావు. చక్కగా నైవేద్యాలు ఆరగిస్తోన్నావు. హారతులూ, మేలుకొలుపులూ, పవ్వళింపు సేవలూ అందుకుంటూనే వున్నావు, అనుకుంది.

ఇంతలో ఎదురింటి వసారాలోంచి రాజు మాటలు వినిపించాయి. అప్పుడే వూళ్లోంచి వచ్చినట్టున్నాడు.

"తెల్లారి ఫస్టు బస్సుకే మన తిరుగు ప్రయాణం. రేపటి పెళ్లోళ్ళ డ్యాన్సు ప్రోగ్రాం కూడ కాన్సిలయింది. వీళ్ళలాగే వాళ్ళు కుర్రోళ్ళే డ్యాన్సు లేస్తారట...." అంటున్నాడు.

రోజా 'ఫ్రీ' అయినట్లుంది- "ఇట్టాగయితే మన కూట్లో దుమ్మే!..." అంటూంది.

వనజ దీర్ఘంగా నిట్టూర్చింది. గుళ్ళో రామయ్య వంక దిగులుగా చూస్తూ విరక్తిగా నవ్వింది. మనస్సులో ఇలా అనుకుంది.

ఎందుకయ్యా? రామయ్య అలా చిర్నవ్వులు చిందిస్తోన్నావు? మమ్మల్ని చూస్తోంటే నీకూ నవ్వులాటగా వుందా? అవున్లే. ఆ కాలంలో నీ రాజ్యంలో నీ సభలో అప్సరాంగనల అమర నృత్యాలు చూశావు. ఈ కాలంలో నీ గుళ్ళల్లో నీ సాన్నిధ్యంలో దేవదాసీల చేసే నృత్యాలు చూశావు! ఆఖరికి మాలాంటి 'దొమ్మరి లంజలు' చేసే బజారు డ్యాన్సులూ చూశావు! చివరికి ఈ రోజు ఈ మొగముండా కొడుకులు చేస్తోన్న ఈ కొజ్జా డ్యాన్సులూ చూస్తోన్నావు! అందుకే నీలో నీవు నవ్వుకుంటున్నావు కదూ!

కాని, ఈ నాగరికతల మార్పిడిలో - ఒక నాగరికతను మరో నాగరికత కబళిస్తూ పాదఘట్టనం చేస్తోంటే ఆ క్రొత్త నాగరికత పాదాల క్రిందపడి నలిగిపోతూ మాలాటి దీనులూ హీనులూ చేసే ఆక్రందనలూ, ఆకలి ఆర్తనాదాలూ నీకు వినిపించవు! వినిపించినా నీవు వులకవు, పలకవు. నీవు నిండుకుండవు-తొణకవు! నీది చిద్విలాసముద్ర - అది చెరగదు! నీది చిన్మయానంద కమనీయ విగ్రహం - అది రవ్వంతయినా చెన్నుదరగదు! మేమే చావాలి!

మేమే ఆకలితో మాడాలి!!....

మా బ్రతుకులే బుగ్గి అవ్వాలి!!!..... ఆమె చూపు రాములవారి విగ్రహం మీదే నిలిచివుంది....

ఇంతలో ఆమె చెయ్యి తలుపు కడ్డీమీదనుంచి క్రిందకు జారింది.

చేతికి ఏదో మెత్తగా తగిలింది.

క్రిందకు చూచింది. దేముడి ఫలహారం - అరటిపండు!

వనజ దానివంక ఆశగా చూచింది. గబుక్కున దాన్ని చేత్తో తీసికుంది.

గబగబా వలచి, తినటానికి ఆత్రంగా నోటి దగ్గర పెట్టుకుంది.

ఇంతలో వెనుక అడుగుల చప్పుడు వినిపించింది.

వెనక్కి తిర్గి చూచింది.

తన చెల్లెలు శాంతి.

- ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక

*12 మే 1983*

★